# తెలుగు జ్యోతి - తొలి సంపాదకుడు



**- *శ్యామలాదేవి దశిక***

శ్రీ కిడాంబి రఘునాథ్ గారి ఆధ్వర్యంలో ప్రారంభమైన తెలుగు జ్యోతికి అప్పుడే 25 సం॥ నిండుతున్నాయి. ప్రవాసాంధ్రుల్లో వున్న రచయితలను, కవులను, సాహిత్యప్రియులను, తెలుగు భాషాప్రియులను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో స్థాపించబడిన పత్రిక ఈ తెలుగు జ్యోతి.

తెలుగు జ్యోతి రఘునాథ్ గారి ముద్దుబిడ్డ. కిడాంబి గారి సంరక్షణలో అల్లారుముద్దుగా పెరిగిన పాప తెలుగు జ్యోతి. రఘునాథ్ గారి శిక్షణలో సంప్రదాయబద్ధంగా పెరిగిన అచ్చమైన తెలుగు యువతి ఈ తెలుగు జ్యోతి. పాతికేళ్ళ పడుచుగా తెలుగు జ్యోతి ప్రారంభసంచికలు ఎంతో ఉత్సాహంతో మొదటినుంచి చివరి దాకా చదవడం నాకు బాగా గుర్తు. ఇప్పుడు తెలుగు జ్యోతికి పాతిక సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా ఈ శీర్షిక రాస్తున్న నాకు నడివయస్సుతో పాటు నడుంనెప్పి, నీరసం, నిరుద్యోగం వగైరా వగైరా లాంటి లక్షణాలు ఎన్నో వచ్చాయి. ఇలా నేనే కాదు, ఎంతోమంది ప్రవాసాంధ్రులు తెలుగు జ్యోతితో పెరిగినవారే!

రఘునాథ్ గారు ఒక ఉన్నత ఆశయంతో ఈ పత్రికను స్థాపించడమే కాకుండా ఆయన వున్నంతవరకు ఎడిటర్ అనే పేరుతో మన సమాజానికి ఒక దిక్సూచిగా వుండేవారు. ఆయన ఎడిటోరియల్ కాలమ్ ఎప్పుడూ ప్రవాసాంధ్రులుగా మన కర్తవ్యాన్ని గుర్తుచేస్తుండేది. సమాజం చక్కగా ఎదగడానికి, మనం వేసే ప్రతి అడుగును పరిశీలించుకోవ డానికి రఘునాథ్ గారు తెలుగు జ్యోతిని ఒక చక్కని సాధనంగా మలిచారు. సంఘంలో జరుగుతున్న మంచి-చెడులను విశ్లేషిస్తూ మనకు స్ఫూర్తిని కలిగించే విధంగా చివరలో "మీరేమంటారు?" అంటూ ఒక ఆలోచనా బాణాన్ని విసిరేవారు పాఠకులమీద. ఆయనకు తెలుగు భాష అన్నా, సంస్కృతీ సంప్రదా యాలన్నా ఎంతో మక్కువ. పత్రికా సంపాద కుడిగా ప్రతినెలా బరబరా వుట్టినే కాగితం మీద రాసి అందరూ పాటించండీ అని కాకుండా, ఆయన స్వయంగా ఆచరించి చూపించి తెలుగు సమాజానికి ఆదర్శంగా నిలబడిన వ్యక్తి కిడాంబి రఘునాథ్ గారు.

ప్రవాసాంధ్రులుగా వచ్చిన మనం అందరం అన్ని సుఖాలతో పాటు జీవితంలో ఎన్నో ఎగుడు దిగుళ్ళు చూసాం, చూస్తున్నాం. తెలుగుజ్యోతి కూడా (మనలాగే ప్రవాసాంధ్ర పత్రిక కదా! ) సుఖాలతో పాటు కష్టనష్టాలను ఎదుర్కొంటున్నా, ఆశతో ధైర్యంగా ముందుకు నడుస్తున్నది. కిడాంబి రఘునాథ్ గారి సారథ్యంలో నిరాటంకంగా, సజావుగా నడచిన 'తెలుగు జ్యోతి' హఠాత్తుగా వీచిన పెనుగాలికి రెపరెపలాడుతున్న సమయంలో చేతులు అడ్డుపెట్టి ఆదుకున్నారు, శ్రీ భావరాజుమూర్తి గారు. అన్ని విధాలుగా ఎంతో అనుభవము-సమర్థత కలిగిన 'నిండుకుండ' వంటి మూర్తి గారు పిల్లకాకుల్ని కమిటీలో వేసుకొని తెలుగు జ్యోతిని సరికొత్త వెలుగుతో గత ఐదు సంవత్సరాలుగా పాఠకులముందు వుంచుతున్నారు.

మన మధ్య పుట్టి, మనతో పెరుగుతూ, మనతో నడుస్తున్న తెలుగు జ్యోతి కలకాలం వెలుగుతూ వుండాలని కోరుకుంటున్నాం.

ప్రవాసాంధ్రులనే ప్రమిదలో సమాజమనే నూనెపోసి ఆలోచననే వత్తితో తెలుగు జ్యోతిని వెలిగించిన తొలి సంపాదకులు శ్రీకిడాంబి రఘునాథ్ గారు.



Telugu Jyothi Special Issue April 2008